ఒక దీపం వెలిగింది

-రాధిక

"శ్యామలరావు ఎక్స్‌పైర్డ్, స్టార్ట్ ఇమ్మీడియట్లీ" అన్న టెలిగ్రాం ఆ ఇంట్లోని వారి నందరినీ ఒక్కసారిగా-ఏ చిన్న సూచనగాని లేకుండా అనుమానంగాని రాకుండా వచ్చే తుఫానులా వచ్చి, శోక సముద్రంలో ముంచేసింది. అది నాలుగక్షరాలే ఉన్న సలుచదరమైన, గాలి వీస్తే, మనం వదిలేస్తే, ఎగిరిపోయే పలుచని కాగితమే కావచ్చు. కాని దానిమీదున్న ఆ నాలుగు పదాల సంగతి మమతను, భానుమూర్తిని, పార్వతిని, వరంధామయ్యను అంతులేని విచారానికీ, కొండంత దుఃఖానికీ, ఆకాశమంత ఆవేదనకూ గురిచేసింది.

ఆ చనిపోయింది ఎవరో కాదు. వరంధామయ్యగారి అల్లుడు, భానుమూర్తి బావమరిది అయిన శ్యామలరావు. అందరి మనసులు శవంగా మారిన శ్యామలరావు మీద లేవు, ఇకపై శవంగా బ్రతకవలసిన ఆ ఇంటి ఆడబడుచు వినూత్న పైకి మళ్ళాయి. వారు బాధపడగలరు, ఏడవగలరు, ఎన్నో విధాల వినూత్నను ఓదార్చగలరు, కాని శ్యామలరావు ప్రాణాలు మాత్రం తీసుకొని రాలేరు. అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ మానవుని మేధకు అతీతమైనది అతనికిగాని, మరెవ్వరికీగాని అందకుండా, ఎవరితోనూ చెప్పకుండా వెళ్ళిపోయేదీ ప్రాణం ఒక్కటే! 'ఎన్నో సాధించాను' అనుకున్న మానవుడు, చంద్రమండలాన్ని చూసి వచ్చి, సూర్యమండలం ఎలా చేరాలా అని ఆలోచించే మానవుడు ఈ ప్రాణం సంగతి మాత్రం తెలుసుకోలేకపోతున్నాడు. ఆ విషయంలో అతను అసహాయుడే.

అందరూ దుఃఖించి, దుఃఖించి, శ్యామలరావు చనిపోయిన కారణం తెలియక గబగబా నాలుగు బట్టలు సర్దుకొని, విషణ్ణ వదనాలతో, విచారం నిండిన మనసులతో ట్రెయిన్ ఎక్కారు. ఒకరినొకరు చూసుకున్నా పలకరించుకున్నా అందరిలోను దుఃఖం మాత్రమే పెల్లుబుకుతూంది. అదే వారి శరీరాలనన్నిటినీ ఆక్రమించుకొని, ఆకలి మాటగాని, సంతోషం మాటగాని ఎత్తనీయకుండా చేసేసింది. ఎప్పుడెప్పుడు ముమ్మిడివరం వెళదామా ఎప్పుడెప్పుడు వినూత్నను ఓదారుద్దామా అన్న తపనే అందరిలోను ఆక్రమించి ఉంది. ఆ ఇంటి గారాల ఆడబడుచు ఘోరంగా భర్తను పోగొట్టుకుంది అన్న ఆలోచన వారి శరీరాన్ని నిస్సత్తువుగాను, నిష్ప్రాణగాను చేసేసింది.

పార్వతి దుఃఖం అయితే వర్ణశక్యం కాకుండా ఉంది. రైలు ప్రయాణం చేసే, కృష్ణా, గోదావరులు రైలు బ్రిడ్జి క్రింద నుంచి ఆమె కన్నుల్లోకి చేరివరదలై పొంగినట్లు, ఆ వరదల్లో ఆ కుటుంబాన్ని ముంచెత్తినట్లుగా ఉంది! ట్రెయిన్‌లో ఒకరిద్దరూ వారి దుఃఖానికి కారణం తెలుసుకొని సానుభూతి చూపారు. సానుభూతి వల్లనూ, ఏడుపుల వల్లనూ చనిపోయిన ప్రాణం తిరిగివస్తే ఇక చెప్పేదేముంది!

పార్వతి, వరంధామయ్య, భానుమూర్తి ఆలోచనలు ఒక విధంగా ఉంటే, మమత ఆలోచనలు మరో విధంగా ఉన్నాయి. 'ఎందుకిలా అయింది? ఇకపై వినూత్న జీవితానికి దారి ఏది? నిండా ఇరవై సంవత్సరాలు లేని వినూత్న బ్రతుకు అప్పుడే చరమాంకానికి వచ్చేసిందా? ముందు ముందు ఎలా బ్రతుకుతుంది?' అన్న ఆలోచనేగాని, శ్యామలరావు చనిపోయాడన్న బాధ ఆమెలో కించిత్తైనా కలగలేదు. కారణం శ్యామలరావు అంటే కోపం కాదు. అత్తగారింట్లో వినూత్న బ్రతుకును, దానికి కారణమైన శ్యామలరావుని తలచుకున్న నిర్లిప్తత.

ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లిన అత్తగారికి బలవంతంగా మంచినీళ్ళు పట్టించింది పార్వతి. అదే చేత్తో మామగారికి కూడా మంచినీళ్ళు అందించింది. ఆ మంచినీళ్ళతో ఆ కడుపులు తాత్కాలికంగా సేదతీరినా, ఆ మనసులకు బాధ మాత్రం మరింత ఎక్కువైంది. అలా జేరబడి కిటికిలో నుంచి చూస్తూంది మమత. వినూత్న గుర్తుకి వచ్చింది. ఆమె అత్తింటి గురించి చెప్పిన మాటలు చెవులో రొదమొదలు పెట్టాయి.

** ** **

"హాయ్, వదినా," వంటింట్లో పనిలో ఉన్న మమత కళ్ళు మూసింది వినూత్న. వినూత్న వస్తుందన్న సంగతి తెలియని మమత ఆశ్చర్యపోయింది.

"ఎప్పుడు రాక, కబురూ కాకర కాయి లేకుండా?" అంది నవ్వుతూ. వినూత్నను చూసిన సంతోషం ఆమె మొహంలో తాండవిస్తూంది.

"కబురు చేయలేదుగాని, కాకర కాయి పంపానే, అందలేదా?" అడిగింది వినూత్న. వినూత్న ఆ ఇంటికి వస్తే తల్లికంటే కూడా ముందు పలకరించేది వదిననే. వదిన అంటే అంత ఆప్యాయత, అనురాగం ఆమెకు. మమత కూడా ఆ ప్రేమను, ఆదరణను వడ్డీతోను, చక్రవడ్డీతోనూ కలిపి ఆమెకు అందించేస్తూ ఉంటుంది వినూత్నకు. గబగబా కాఫీచేసి ఆమెకు అందించింది మమత.

"మా తమ్ముడుగారు, మీ అత్త, మామగారు అందరూ కులాసానా? ఒక్క దానివే వచ్చావా?" అడిగింది మమత.

'ఒక్కదాన్నే ఏమిటి? ట్రెయిన్‌లో చాలా మంది తోడున్నారు." "చాలా మంది ఉన్నారులేవోయ్! వాళ్ళందరూ మా తమ్ముడి సాటి వస్తారా, మీ అత్తగారి సాటివస్తారా చెప్పు. వాళ్ళందరూ బాటసారులే!"

"నిజమే, వాళ్ళు నా భర్తసాటి, నా అత్తసాటి ఎందుకు వస్తారు? వాళ్ళందరూ మంచి వాళ్ళు కాబోలు, మా అత్తింటి వారిలా నన్నొక్క మాట కూడా అనలేదు." నవ్వుతూ అంది.

వినూత్న కష్టాల్ని కూడా నవ్వుతూ భరించడం పెళ్ళైననాటి నుంచే అలవాటు చేసుకుంది. మూడుముళ్ళు పడిన తరువాత అంతకంటె గత్యంతరం లేదు మరి ఆమెకు.

మమత స్నానానికి నీళ్ళు పెట్టింది. స్నానం చేసి ఫ్రెష్‌గా తయారై వచ్చి మమతకు వంటలో సాయం చేయడానికి కూర్చుంది వినూత్న.

"లే తల్లి లే, ఇంత సహాయం చేసి, అంత దెప్పుతారు ఆడపడుచులు! నేను చేస్తానులే పని, నీవు వెళ్ళి అలా పుస్తకం పట్టుకొని కూర్చొని అందులో కథలు చెప్పు చాలు నాకు" అంది మమత-వినూత్నను ఏడిపించే ధోరణిలో.

కాని అసలు సంగతి అదికాదు. వినూత్నకు అత్త వారింటిలో, ఆ పల్లెలో క్షణం తీరిక ఉండదని తెలుసు. ఇక్కడైనా శరీరానికి కొంచెం విశ్రాంతి ఇవ్వాలని మమత ఆరాటం.

"ఏం, ఆడబడుచులను అంటారుగాని, వదినలు మాత్రం ఏం తక్కువ? మా ఆడబడుచు వచ్చి వెళ్ళింది, ఇక్కడ పుల్ల అక్కడ పెట్టింది కాదు అని రాగాలు తీస్తారు, సరిగమలు రాకపోయినా, కట్టెపుల్లల పొయ్యిలు ఇక్కడ లేకపోయినా." నిష్ఠురాన్ని గొంతులోకి కొని తెచ్చుకొంది వినూత్న. కాని అది హాస్యంగా అనిపించింది, నిష్ఠురంగా ధ్వనించలేదు మమతకు. బహుశా ఏమాటైనా తప్పు, ఒప్పు అనేది, అనేవారి మనసు సంగతి ఎలా ఉన్నా అర్థం

డబ్బు

విద్యుత్తు అంధకారానికి
వెలుగును ప్రసాదిస్తే
విద్యుద్ఘాతం జీవితానికి
ముగింపు నిస్తుంది—

మానవుడు డబ్బును
అవసరాలకు సృష్టిస్తే
ఆ డబ్బు మానవతకే
సమాధి కడుతోంది—

-మద్దినేని రాధాకృష్ణమూర్తి

చేసుకునే వారి మనసుని బట్టి దాని అర్థం మారిపోతుందేమో! మన మనసులో మంచితనం ఉంటే, ఎదుటి వారు మాటలు, పనులు కూడా మంచిగానే కనిపిస్తాయి, లేకుంటే పచ్చ కామెర్ల వాడితంతే మరి!

వినూత్న పుస్తకం పట్టుకుని కూర్చుంది. కథ చదవబోయింది గాని మనసుకు కథ ఎక్కడం లేదు, తన కథ మీదికే మళ్ళుతూంది. ఊ అంటే చికాకుపడే విధవాడబడుచు, ఇంట్లో ఏ తప్పు జరిగినా కోడలి మీదకు నెట్టే మామగారు, అందరి తిట్లనూ సపోర్టు చేసే అత్తగారు, అన్నిటికీ మించి 'ఆ ఇంట్లో ఒక అమ్మాయి ఉంది, ఆ అమ్మాయి నా భార్య అన్న సంగతి ఏ అక్సిడెంటులోనో మరచిపోయాడేమో' అనిపించే భర్త-ఇవన్నీ సినిమా రీళ్ళలా, పుస్తకంలోని కథల్లా ఆమె ముందు కదలాడసాగాయి. అక్కడి నుంచి కదలనని మొరాయించాయి

"ఇంతకా పుస్తకంలో కథ చెప్పమంటావా? నా కథ చెప్పమంటావా?" అడిగింది వినూత్న.

"పుస్తకంలోది తరువాత నేను తీరిగ్గా చదువుకుంటానులే! ముందు నీ కథ చెప్పు, వినాలని చాలా కోరికగా ఉంది." మమత అంది.

"కడుపులో ఉన్న వాళ్ళకు ఏదో తినాలని కోరిక ఉండేదంటారుగాని, కథ వినాలని కోరిక ఉంటుందా ఎవరికైనా?" మమత ఎత్తుగానున్న కడుపు వైపు ఆనందంగా చూస్తూ అంది వినూత్న. మమతకు అయిదేళ్ళ శ్వేత ఉంది. ఇప్పుడు మళ్ళీ ప్రెగ్నెంటు.

"ఏమో, మళ్ళీ నీలాంటి ఆడపిల్ల పుడుతుందేమో అందుకే నీ కథ వినాలని కడుపులో ఉండే ఉబలాటపడుతూంది" అంది వేయించిన జీడిపప్పు పళ్ళెం వినూత్న ముందుకి తోస్తూ— వినూత్నకు ఆ జీడిపప్పు అంటే చాలా ఇష్టం అన్న సంగతి మమతకు తెలుసు.

"వద్దు. వద్దు. నాలాంటి ఆడపిల్ల మాత్రం వద్దు. నా జాతకం ఇంట్లో మరెవ్వరికీ రాకూడదు", కంగారుగా అంది వినూత్న.

నిజానికి వినూత్న జీవితం సంగతి మమత కొక్కదానికే తెలుసు. ఒకటి రెండుసార్లు, భానుమూర్తి చెవిని వేసినా అతను దానికి అంతగా ఇంపార్టెన్స్ ఇవ్వలేదు. ఒకసారి పెళ్ళైన తరువాత, అన్నిటికీ సరిపెట్టుకోవాలి గాని, ఏ విషయంలోనైనా ఎవరుమాత్రం చేసేదేముంది?, అన్నట్లు ప్రవర్తించాడు గాని, అయ్యోపాపం చెల్లెలిబ్రతుకు అలా ఉందా అని కొంచెమైనా బాధపడలేదు. జాలి కూడా చూపలేదు.

భానుమూర్తి భావాలు, స్త్రీ విషయంలోని అతని అభిప్రాయాలు చూస్తుంటే ఏనాడో సతీ అనసూయ, సతీ సుమతి కాలంలో పుట్టవలసినవాడు గాని, ఈ కాలంలో పుట్టవలసినవాడు కాదు' అని చాలాసార్లు అనుకుంది మమత. సతీ సుమతి గాని మరెవరైనా పతివ్రత గాని భర్తను తట్టలో ఎత్తుకొని, వేశ్య ఇంటికి తీసుకెళ్ళింది అన్న సంగతి విని,

'ఆహా,' ఓహో' అనే భానుమూర్తి, ఏ ఝాన్సీలక్ష్మీభాయి గురించో, ఇందిరాగాంధీ గురించో చెబితే మాత్రం ముఖం ముడుచుకునేవాడు.

"మీ ఆయన పరిస్థితిలో మార్పు లేదా?" అడిగింది మమత. "ఊహూ మార్పులేదు. అంతేకాదు మార్పు రాదుకూడా" కచ్చితంగా అంది వినూత్న. ' 'పోనీ, నీవు ట్రై చేయలేకపోయావా, అతని దగ్గరవడానికి?" అడిగింది మమత. అలా అడిగింది గాని అది నిరుపయోగమని ఆమెకూ తెలుసు.

"మావిధవాడబడుచు ఆ అవకాశం ఇవ్వదుగా? నా భర్తతో నేనెంతో సుఖపడిపోతున్నానని అనుకుంటూంది. తనకులేని సుఖం నాకు ఉండకూడదని ఆవిడ ఉద్దేశం. ఆవిడ భర్తపోయి విధవగా ఎలాగుందో, నేను భర్త ఉండీ విధవనని ఆవిడకు తెలియదు. పూలు పెట్టుకుంటే కోపం, తెల్లచీర కట్టుకుంటే కసి ఆవిడకు. కాని ఆ ఇంట్లో ఆరెండింటి అవసరం లేదని వారికి మాత్రం తెలియదంటావా వదినా?" అడిగింది వినూత్న. భర్త అసమర్థతను గుర్తుకి తెచ్చుకొని.

"ఏమో తెలిసి ఉండవచ్చు, తెలియకపోవచ్చు. తెలిసినా బయటపెట్టుకోరుగా, చూస్తూ వాళ్ళ కొడుకు విషయం" మమత అంది.

"అవును, వాళ్ళ కొడుకు కాబట్టి ఎన్ని లోపాలున్నా బయటపెట్టుకోరు, కోడలు బయటనుంచి, ఏ జంతువు కడుపునో పుట్టి వచ్చిందని, తప్పులు చేయకపోయినా, తప్పులు నెత్తినరుద్ది మరీ అల్లరి పెడతారు. ఏమిటో వాళ్ళ మనస్తత్వం! పల్లెటూరు గనుక ఏ చిన్న కబురు అయినా ఇట్టే అన్ని ఇళ్ళకూ, తమాషాగా పాకిపోతోంది వదినా! ఆ ఇంట్లో నా సంగతులు నాకు తెలియకపోయినా ఊరివారందరికీ మాత్రం తెలుసు. ఏమిటో నేను ఎంత జాగ్రత్తగా ఉన్నా లేనిపోనివి, నా మనసులో లేని చెడ్డ ఆలోచనలు కూడ కల్పించి, కథలు అల్లి ఊరంతా టాం, టాం చేస్తారు. అందరూ నన్ను ఏ సెంట్రల్ జైల్లోనుంచో పారిపోయి వచ్చిన దోషిలా చూస్తారు గాని, ఆ ఇంటికి పుట్టింటిని వదులుకొని వచ్చిన ఒక స్త్రీలా చూడరు" వినూత్న కంఠం వణికింది.

"ఇది నీ ఒక్కదాని సమస్య కాదు విన్నూ, భారతదేశంలో ప్రతి ఇంటా, ప్రతీ కోడలికీ ఉన్న సమస్యే. ఎవరో, ఎక్కడో, ఏ నిందలూ పడకుండా నిశ్చింతగా బ్రతికేవారుంటారు. అందరి స్త్రీల జీవితాలూ వడ్డించిన విస్తర్లు కావు".

"వదినా! తప్పు చేయకుండా ఎందుకు మాటలు పడాలి?"

"తప్పు చేయకుండా నీవు మాటలు పడుతున్నావంటే అది నీ తప్పుకాదు, ఎదుటివారి ఆలోచనల లోపం. నీవు బంగారు కొండవి. నాకు తెలుసుకదా, నీ మనస్తత్వం. చీమకైనా హాని చెయ్యడానికి ఇష్టపడని దానివి. నీ నోటినుంచి ఇప్పటివరకూ ఒక్క పరుషమైన మాట కూడ వినలేదు నేను. నీలాంటిదాన్ని అర్థం చేసుకోలేక పోవడం వారి తెలివితక్కువతనం, బాధపడకు విన్నూ!" మమత ఓదార్పుగా అంది.

"పోనీ అందరి సంగతీ వదిలేయి, ఆయన కూడా నా సంగతి అసలు పట్టించుకోరు. నా బదులు, వారు ఒకమంచి పనిమనిషిని పెట్టుకొని ఉండే బావుండేది." వినూత్న అంది.

"ఆ పనిమనిషికి జీతం ఇవ్వద్దా?"

"నిజమే. బాగా చెప్పావు. పనిమనిషికి అయితే జీతం ఇవ్వాలి. జీతం ఇచ్చినా, దాన్నేదైనా అంటే ఎదురుతిరుగుతుంది, లేదంటే పని వదిలి వెళ్ళిపోతుంది. కాని భార్య మెడలో మూడుముళ్ళూ వేసికున్న నేరానికి ఆ ఇంటినుంచి పోలేదు కదా! అందుకే ఆమె అందరికీ అలుసైపోయింది. మా ఆయనకైతే ఆ ఇంట్లో అన్ని వస్తువులలో నేనూ ఒకతెను అంతే! కాని ఆయన కొనుక్కున్న ఆ వస్తువులనన్నిటినీ ఎంతో అపురూపంగా చూసుకుంటారు. ప్రాణం లేనివాటి మీద అపేక్షలో అరపాల్యో వంతు కూడా ప్రాణం ఉన్న తన భార్యనైన నామీద లేదు" బాధగా అంది వినూత్న.

నిజమే. అత్తింట్లో ఎన్ని ఆర్థిక, శారీరక, ఇబ్బందులున్నా, ఏ విషయంలో మనశ్శాంతి లేకపోయినా భర్త అనేవాడు భార్యను, దరి చేర్చుకొని చిన్న ఓదార్పుమాట పలికితే చాలు, ఆమె ఎన్ని బాధలనైనా మరిచిపోతుంది. వెయ్యి ఏనుగుల బలాన్ని తెచ్చుకుంటుంది. కాని దురదృష్టం కొద్దీ వినూత్నకు ఆ అవకాశం కూడా లేదు.

"వదినా ఒకమాట చెప్పనా, ఆ ఇంట్లో ఒకరికి నేనంటే ఎంతో ఇష్టం" నవ్వుతూ అంది వినూత్న.

వినూత్న నవ్వు చూసి, తానూ నవ్వుతూ ఆశ్చర్యంగా, "ఎవరబ్బా, ఇదివరకు నాకెప్పుడూ

చెప్పలేదే!" మమత అంది.

"మా కుక్క విక్కీ ." నవ్వుతూ వినూత్న మాటవిని మమతకు ఎంతో బాధ కలిగింది.

"అది అందరినీ అప్యాయంగా నాకినట్లే నన్నూ నాకుతుంది. అందరినీ చూసి తోక ఆడించినట్లే నన్నూ చూసి ఆడిస్తుంది. బహుశా నేను ఆ ఇంటి కోడల్ని అని దానికి తెలియదేమో!" వినూత్న అంది.

"అవును అది జంతువు కదా! దానికి ద్వేషం అంటే ఏమిటో తెలియదు పావం" మమత అంది. భానుమూర్తి రావడంతో సంభాషణ ఆగిపోయింది.

"ఏమే, విన్నూ, బావున్నావా?" ఆప్యాయంగా అడిగాడు మూర్తి.

భానుమూర్తికి తన చెల్లెలిలో పాతకాలంనాటి పతివ్రతలు అందరూ కనిపించి, ఆమెపై ప్రేమ వెల్లువలా పొంగుతూ వస్తుంటుంది అప్పుడప్పుడు. అంతేగాని పెళ్ళై మూడేళ్ళైనా, రెండున్నర సంవత్సరాలు పుట్టింట్లోనే ఉంచేశారు అనిగాని, ఆరునెలల క్రితం ఆమెను అత్తవారింటికి తీసుకొని వెళ్ళినా ఇప్పటివరకూ ఆమెభర్త ఆమెను తాకలేదు అనిగాని అతనికి బాధలేదు. వినూత్న అన్నిటిని ఓర్పుకుంటూ కాపురం చేస్తూందని, ఈ కాలంలో పుట్టవలసినది కాదని, చెల్లెలంటే అతనికి అపురూపమైన భావన. అంతేగాని చెల్లెలు సంసార సుఖానికి దూరంగా ఉందని అతనికి ఏమీ బాధలేదు. పైగా పెళ్ళైన ఆడది ఎలాంటి కష్టమైనా భరించాలి అంటాడు. అత్తగారు మళ్ళీ ఏడుపు మొదలుపెట్టడంతో ఈ లోకంలోకి వచ్చిపడింది మమత, ఆలోచనలోనుంచి. తన కన్నకూతురు బ్రతుకు తన కళ్ళెదుటే భగ్నమైతే, ఏ కన్నతల్లి మాత్రం తట్టుకోగలదు? ఆవిడను ఓదార్చి, కొంచం మజ్జిగ ఇచ్చి మళ్ళీ పడుకోబెట్టింది మమత. భానుమూర్తి మెదడులో ఏ ఆలోచనలు ఉన్నాయోగాని, వాటిని బయట పెట్టడం లేదు, అలా రాయిలా ఆలోచిస్తూ కూర్చున్నాడు.

మళ్ళీ తన ఆలోచనలలోకి తాను వెళ్ళిపోయింది మమత. 'వదినా అత్తా ఒకింటి కోడలే అంటారు కదా! కాని నేను అది తప్పంటాను' వినూత్న మాటలు గుర్తుకి వచ్చాయి మమతకు.

"తప్పా! మరేం అంటారు?"

"అత్తా, ఆ ఇంటి కోడలేనంటాను. అత్తగారు కూడా ఒకానొకప్పుడు ఆ ఇంటికి కోడలులాగే వచ్చి ఉంటుంది కదా, తన లాగే ఆ ఇంటికి వచ్చిన కొడుకు భార్యపై ఎందుకు కసి పెంచుకుంటుంది?"

"ఏమో అడిగొస్తానుండు".

"ఎవరిని?"

"ఇంకెవరిని, మీ అత్తగారిని"

"ఒద్దుబాబోయ్, అంతపని చెయ్యకు. ఆవిడ నోటికి తట్టుకోలేవు. పైగా, ఇప్పుడు వెళ్ళడానికి నీకు బ్రెయిన్ కూడలేదు".

"ఆవిడ నోటికి తట్టుకోలేనా? ఎందుకు తట్టుకోలేదు. నాకూ ఉంది. నాలుగంగుళాల వెడల్పు నోరు అని చెప్పిమరీ వస్తాను".

"నీకుంది నాలుగంగుళాల వెడల్పు నోరేనా?"

"ఆ. నవ్వితే నాలుగంగుళాలు, ఏడిస్తే ఏడంగుళాలు ఆవలిస్తే ఆరంగుళాలు, మూతిముడిస్తే మూడంగుళాలు, నోరువిప్పి తిట్లు తిడితే..."అంటూ ఏదో చెప్పబోయింది.

"వద్దులే! నోరుంది కదా అని పారేసుకోకూడదు. దాన్ని అదుపులో పెడితేనే అందం, తిట్టాలంటే అందరూ తిట్టగలరు. మాటలు అందరికీ వస్తాయి. కాని వాటిని కంట్రోల్‌లో పెట్టుకుంటేనే బావుంటుంది. అనకూడనివి అన్నవారు, వినకూడనివి వినవలసి వస్తుంది మరి" వినూత్న అంది.

వినూత్నకు అర్థం కానిదల్లా తన ప్రవర్తనలో ప్రతి విషయానికి పెడర్థాలు తీసి, ప్రతిదానికీ సాధించడం. అలాంటి మనస్తత్వం ఉన్నవారి మధ్య బ్రతకడమూ కష్టమే, వారిని మెప్పించడమూ కష్టమే మరి!

"మీ ఆయన రోజూ రాత్రుళ్ళు ఎక్కడ పడుకుంటాడు."

"వాళ్ళ అమ్మపక్కలో. ఏనాడూ ఆవిడ నాదగ్గర పడుకోనివ్వదు. ఆయన కూడ అవకాశం తీసుకోడు."

"అమ్మదగ్గర పడుకునేవాడికి పెళ్ళెందుకు?"

"పనిమనిషి ఖర్చు కలిసి రావడానికి, లోకానికి నేను మగవాణ్ణని చాటి చెప్పుకోడానికి".

"మగవాడు, భార్యను ఉసురు పెట్టినవాడు, పెళ్ళాన్ని బాధించినవాడూ మగవాడేనా. భార్యను సంతోషపెట్టి నేను మగవాడిని అని గర్వంగా చెప్పుకోవాలి. ప్రతి భర్త నీడలో భార్య ఆదమరచి బ్రతకాలి గాని, అదురుతూ, బెదురుతూ, తుమ్మితే ఊడిపోయే ముక్కులా బ్రతికే బ్రతుకూ ఒక బ్రతుకేనా ఆడదానికి!" మమత అంది.

"పోనీ ఆయన్ని ఎలాగో ఒప్పించి ఒకసారి ఇక్కడకు తీసుకొని రాకూడదూ, ఎలాగైనా డాక్టరుకి చూపిద్దాం."

"అది అసలు అయ్యే పని కాదు. ఏమీ తెలియని వారికి మనం ఏదైనా చెప్పి ఒప్పించవచ్చు. అన్నీ తెలిసిన వారికి మనం ఏం చెప్పగలం? పైగా మా అత్తగారు పెళ్ళై మూడేళ్ళైనా పిల్లలు లేరని, నేను గొడ్రాలినని, ఎవర్నైనా పిల్లల్ని పెంచుకుంటే మంచిదని ఊరంతా డప్పు లేకుండానే చాటింపు వేస్తుంది. నన్నే నిందలపాలు చేస్తుంది."

"ఈసారి నీవు డప్పు కొనియ్యి. ప్రకటనలో కొంచెం మార్పు చెయ్యమని చెప్పు."

"ఏం మార్పు చెయ్యమనాలి?"

"మా అబ్బాయి చేతకానివాడు. అందుకే పిల్లలు పుట్టడం లేదు అని."

"ఇంకేమైనా ఉందా? నాకు విడాకు లిచ్చి కొడుక్కి మరో పెళ్ళి చేస్తుంది. ఆవిడ ఏ పనైనా చేయగల సమర్థురాలు!"

"పెళ్ళి చేసుకొని నీ వెంత సుఖపడుతున్నావో, ఆ రెండో ఆవిడా అంతే సుఖపడుతుంది. అందరూ నీలా నోరు మూసుకొని ఊరుకోరు. ఆవిడైనా మీ ఇంటివారి కళ్ళు తెరిపిస్తుంది." మమత అంది.

వినూత్న ఆ ఇంటి నుంచి వచ్చేయడానికి గాని, భర్త రెండో పెళ్ళి చేసుకొనడానికి గాని సుముఖంగా లేదు. ఎప్పటికైనా భర్త మారకపోతాడా, కష్టా లెంతకాలం ఉంటాయి అని ఆలోచిస్తుంది గాని, ఆ ఇంట్లో తన బ్రతుకు ఎలా ఉందో ఆమె అసలు ఆలోచించదు. ఆలోచించే తీరిక, ఓపికా ఆమెకు లేవు. అసలు ఆమెకు సెక్స్ అనుభవం తెలియదు. అందుకే అలా ఆమె భర్త ఆమె దగ్గరికి చేరకపోయినా అంతగా పట్టించుకోవడం లేదు. కాని, పెళ్ళైన అందరు స్త్రీలలా తన జీవితం కాదని మాత్రం అప్పుడప్పుడూ బాధపడుతూ ఉంటుంది. మమతకు మాత్రం వినూత్నను చూస్తుంటే వయసుకి తగినట్లుగా మనసు, కోరికలు పెరగలేదేమో అనిపిస్తుంది.

మామగారు మంచినీళ్ళు అడగడంతో ఈ లోకంలోకి వచ్చింది మమత. మమత, ఆమె పేరుకు తగినట్లే అందరినీ మమకారంతో చూస్తుంది. సాధారణంగా ఎవరికో గాని పేరుకి తగిన గుణాలు రావు.

ఆడవారి విషయంలో భర్త మనస్తత్వం నచ్చకపోయినా, అతని మాట ప్రకారం నడుచుకోవడం, అత్తమామలను కన్నతల్లితండ్రుల



వలె చూడడం ఆమెకు ఆమే సాటి. అసలు వదినా, మరదళ్ళ బంధం ఎంతో చక్కని బంధం. హాస్యాలతోనూ, ఛలోక్తులతోనూ సరదాగా గడిపే బాంధవ్యం అది. ఒకరు ఒక ఇంటి నుంచి వచ్చినవారైతే, మరొకరు మరో ఇంటికి వెళ్ళవలసినవారు. మమతను, వినూత్నను చూస్తుంటే వదినా, మరదళ్ళంటే ఇలా ఉండాలి అనిపిస్తోంది. అస్తమానూ ఆడబడుచులమీద వినుక్కునే వదినలు, వదినలమీద నేరాలు చెప్పే ఆడబడుచులు ఉండే మన సంఘంలో వినూత్న, మమత లాంటివారు అరుదైనవారు, అపురూపమైనవారు.

ఆడబడుచు పుట్టింటికి వస్తేనే మొహం మాడ్చుకునే వదినలు కోకొల్లలు. వదినను చూడగానే, అన్నయ్యను కొంగుకు ముడేసుకుందని (ఆమె తన భర్తని వేసుకోవచ్చు, కొంగునా, కొప్పునా కూడా ముడి) తమ నుంచి అన్నయ్యను వేరు చేసిందని, అన్నయ్య చిన్నప్పటిలా జడలు వేయడం లేదని, బడికి తీసుకొని వెళ్ళడం లేదనీ అలిగే చెల్లెల్లు, వదిన మనసుని విపరీతంగా నొప్పించే ఆడబడుచులు ప్రతి ఇంటా ఉన్నారు సాధారణంగా. ఎంతో అర్థం చేసుకొని ప్రవర్తించవలసిన వదినా మరదళ్ళు చిటపటలాడుతూ, నిప్పు లేకుండానే గంతులు వేస్తారు.

"మీ అమ్మగారా?" ఆ ప్రశ్నకు మమత ఉలిక్కి పడింది. "కాదండీ మాఅత్తగారు" అంది ఆ ప్రశ్న అడిగిన పక్కావిడతో. ప్రజలలో మరో పెద్ద అనుమానం. ఆడవాళ్ళు అమ్మనే గాని, అత్తను ప్రేమగా చూడరని. ప్రేమగా చూసినా అది సవతితల్లి ప్రేమ లాంటిది అంటారు గాని, నిజమైన ప్రేమ అని ఎవరూ అంగీకరించరు. మరొకళ్ళను అంగీకరించనివ్వరు. పార్వతమ్మగారు కూడా వినూత్నను, మమతను వేరు వేరుగా చూడలేదు. వినూత్న పెళ్ళికి మూడు సంవత్సరాల ముందే మమత ఇంటి కొచ్చింది. మమతలోని మమకారం చూసిన పార్వతమ్మగారు, నేను పోయినా ఫరవాలేదు, వినూత్నను మమత తల్లిలా చూసుకుంటుందని అనుకున్నారు.

అమ్మ, అత్త అనే పదాలలో ఒక్క అక్షరమే తేడా ఉండి ఉండవచ్చు కాని, వాటి స్వరూపాలలోను, స్వభావాలలోనూ నక్కకీ నాగలోకానికీ ఉన్నంత తేడా ఉంది. అమ్మగా తన బిడ్డలకు ఆప్యాయత పంచిపెట్టే తల్లి, అత్త తన కోడలిపై అనురాగం చూపదు. పైగా కొడుకుని తనవైపు తిప్పుకుందనే కోపంతో కోడలిని శత్రువుగా చూస్తుంది. 'కోడలు మాత్రం ఎవరు, నేనే గదా ఏరికోరి ఇంటికి తెచ్చుకున్నాను' అన్న సంగతి మరిచిపోతుంది.

ట్రెయిన్ ఒక్కసారి పెద్ద కుదుపుతో ఆగగానే నిద్రావస్థలోనూ, పరిసరాలను పరిశీలించడంలోనూ, ఎవరి ఆలోచనల్లో వారుండడంలోనూ మునిగి ఉన్న ప్రయాణీకులు ఉలిక్కిపడ్డారు. ఒక్కసారిగా పెద్ద కలకలం బయలుదేరింది. ట్రెయిన్ కింద ఒక మనిషి పడ్డాడట. అతణ్ణి దాటుకొని ట్రెయిన్ చాలా దూరం వచ్చేసింది గాని, అతని మొండెం ఒకపక్క, తల ఒక్కపక్క పడి ఉన్నాయి.

అందుకే ట్రెయిన్ ఆగిపోయింది. మమత, భానుమూర్తి వాళ్ళు ఎంత త్వరగా ఊరికి వెళ్ళాలని ఆలోచిస్తున్నారో, అంత ఆలస్యమవుతూంది. పాపం వారి మనసులో ఆరాటం ఆ ట్రెయిన్‌కేం తెలుసు? వినూత్న ఎలా ఉందో, ఇంకా రాలే దేమిటో అని ఎదురు చూస్తుంది కాబోలు అని మమత మనసు బాధగా మూలిగింది. తనకే శక్తి ఉంటే ఎగురుకుంటూ వెళ్ళి వినూత్నను ఒడిలోకి తీసుకోవాలని ఉంది మమతకు. ఆమెను కౌగలించుకొని కరవుతీరా ఓదార్చాలని ఉంది.

అందరూ గందరగోళంగా మాట్లాడుకుంటున్నారు. ట్రెయిన్‌లో సగంమంది కిందకు దిగిపోయారు. శవం జేబులో ఉత్తర ముందట. తిండిలేని కారణంగా, భార్యా బిడ్డలను పోషించలేని అసమర్థతకు, ఉద్యోగం దొరక్క విసుగు చెంది ఆత్మహత్య చేసుకుంటున్నానని, తన చావుకు ఎవరూ బాధ్యులు కారని, ఎవరిదైనా బాధ్యత ఉంటే, ఉద్యోగం ఇప్పించలేని గవర్నమెంటుదేనని రాసి పెట్టాడట. అందరూ అయ్యో పాపం అనకుండా ఉండలేకపోయారు. ఉత్తరం వెనుక నేను చనిపోతే నేను తినే తిండి కనీసం నా పిల్లలకైనా పనికి వస్తుంది అని కూడా రాశాడట. ఆ మాట మరింత బాధించింది అందరినీ.

పాపం చనిపోయేటప్పుడు ఎంత నరకం అనుభవించి ఉంటాడో తన భార్యా పిల్లలను విడిచి వెళ్ళడానికి అనుకుంది మమత.

అంత దుఃఖంలోను పార్వతి, వరంధామయ్యగారు "ఏమిటి సంగతి?" అని అడిగారు భానుమూర్తిని. సంగతి విని వారు కూడా నిట్టూర్చారు. కష్టం వల్ల బాధపడుతుంటే, మరో బాధ ఆ పాత బాధను మరిపిస్తుందట. అలాగే, ఆ శవాన్ని చూసిన పార్వతి, వరంధామయ్యగారు తాత్కాలికంగా అల్లుడి సంగతి పక్కన పెట్టి, కుతూహలంగా అతని హిస్టరీ విన్నారు. అంతలోనే అల్లుడు గుర్తుకి వచ్చి గొల్లుమన్నారు మళ్ళీ.

మరో గంట తరువాత ట్రెయిన్ బయలుదేరింది నీరసంగా, విచారంగా. ఈసారి ట్రెయిన్ గమనంలో అంతకు ముందున్న ఆత్రుత, ఉరుములు పరుగులు లేవు. చనిపోయి నతని ఆత్మ శాంతి కోసం ప్రార్థిస్తూ, మెల్లగా నడుస్తున్న ట్లనిపించింది మమతకు. అతని రక్తం తాగిన ఆ ట్రెయిన్ చక్రాలు స్పీడుగా నడవలేకపోతున్నాయి. 'నాకు బలైపోయావా మిత్రమా' అనుకుంటూ కుంటుకుంటూ నడవసాగాయి. మళ్ళీ ట్రెయిన్ కదలగానే పార్వతి, వరంధామయ్యగారు ఏడ్చినందువల్ల వచ్చిన మగత నిద్రలోకి, భానుమూర్తి పుస్తకంలోకి, మమత తన ఆలోచనలలోకి వెళ్ళిపోయారు.

"వదినోయ్, వదినా!" వినూత్న హడావిడిగా వచ్చింది.

"ఏమిటమ్మా మరదలా ఏమిటి హడావిడి?" మమత అడిగింది.

"ఏమీ లేదు. మా శ్రీవారు నన్ను వెంటనే వచ్చేయమని టెలిగ్రామ్ ఇచ్చారు" అంది. 'శ్రీవారు' అన్న పదంలో హేళనను మమత గుర్తించకపోలేదు. పెళ్ళైన తరువాత శ్యామలరావు ఎప్పుడూ అత్తింటి గుమ్మం తొక్కలేదు. కాపురానికి వెళ్ళిన తరువాత ఒకసారి వచ్చిన వినూత్నను వెంటనే వచ్చేయమని టెలిగ్రామ్ ఇచ్చాడు.



బహుశా భార్యలు పుట్టింట్లో ఎక్కువ కాలం ఉంటె అత్తగారి కథలు, భర్తల భాగోతాలు బయట పెడతారని భయం కాబోలు. కొందరు మగవారు భార్యలను పుట్టింటికి వెళ్ళనివ్వరు, వెళ్ళినా ఎక్కువ కాలం ఉండనివ్వరు.

"మీ శ్రీవారు నీమీద బెంగ పెట్టుకున్నారా?" మమత కూడా వెటకారంగానే అడిగింది వినూత్నను. పార్వతి, వరంధామయ్యలకు అల్లుడి సంగతి తెలియకపోవడంతో ఆ టెలిగ్రామ్ చూసి అల్లుడికి కూతురిపై గల ప్రేమ చూసి వారు మురిసిపోతున్నారు. నిజానికి అల్లుడు అసలు మగవాడు కాదు అన్న సంగతి వింటే వారి మొహాలు ఎలా ఉంటాయోనని ఆలోచిస్తున్నారు వినూత్న, మమత వారి సంతోషాన్ని చూసి.

"మా అత్తగా రున్నంత కాలం ఆయనకు నామీద బెంగగాని, ధ్యాసగాని ఉండదు. అది మాత్రం నూటికి నూరుపాళ్ళు నిజం." వినూత్న అంది.

"పోనీ ఆవిడను కొంత కాలం తీర్థయాత్రలకి పంపలేకపోయారా? అప్పుడైనా శ్యామలరావులో మార్పు ఏమైనా వస్తుందేమో!" మమత అంది. శ్యామలరావు సంగతి వినూత్న కంటే మమతకే పూర్తిగా అర్థమయింది. కాని, ఏదో ఆశ. ఇల్లు ఇరుకుగా ఉన్నందువల్లో అక్కగారికి, తల్లికి జడిసి భార్య దగ్గరకు రాని పిరికి మనస్తత్వం కలవాడేమో అని అనుకుంటూ ఉంటుంది. 'అదే నిజమై, అతనికి ఏదైనా ఊరు ట్రాన్స్‌ఫరై అతను, వినూత్న హాయిగా ఉంటే ఎంత బాగుణ్ణు' అనుకుంటుంది మమత. మమతకు తల్లితండ్రులు గాని, తోబుట్టువులు గాని లేనందువల్ల అనాథాశ్రమంలో కొంత కాలం ఉండి చదువుకొంటుండగా భానుమూర్తి కళ్ళబడి ఆమెను ఇష్టపడి పెళ్ళి చేసుకోవడం జరిగింది. అందుకే వినూత్నలో సోదరిని, అత్తమామలలో తల్లితండ్రులను చూసుకుంటుం దామె.

"ఆవిడను తీర్థయాత్రలకు పంపితే ఇంకేమైనా ఉందా! ఆవిడకు వ్రతభంగమై పోదూ?"

"వ్రతభంగమా! అదేమిటి?"

"కోడలిని కొడుకు దగ్గరకు చేరనీయకూడదనే వ్రతం ఆవిడ ఆచరిస్తుంది. దాన్ని ఎవరైనా ఉల్లంఘించ ప్రయత్నించారో ఉరిత్రాడు వే సేస్తుంది వారికి. ఆ వ్రతం ఆవిడ ఒక్కతికే కాదులే, వాళ్ళ విధవ కూతురు మహంకాళిక్కూడా వర్తిస్తుంది. బహుశా అందుకే తొందరపడి కొడుక్కి పెళ్ళి చేసి ఉంటుంది." వినూత్న అంది.

"నీవు నోరెత్తకపోతే ఎన్ని వ్రతాలైనా ఆచరిస్తారు."

"వదినా! వా రందరూ ఒకటి, నే నొక్కదాన్ని ఒకటి అక్కడ. వారిని ఎదిరించి ఎలా నిలవగలను? అసలే కొత్త వాతావరణం, అంతా నిందలూ, నిష్ఠూరాల మయం. ఇక నాకు జీవితాన్ని గురించి, అందులోని సంతోషాన్ని గురించి ఆలోచించే తీరిక ఎక్కడిది చెప్పు?"

"వా రందరూ ఒకటి, నీ వొకటి అన్న ప్రశ్న ఏమి టసలు? నిన్ను కూడా వారిలో ఒకదానిగా చేసుకోవాలనేగా నిన్ను కోడలిగా స్వీకరించారు."

"తప్పు. తప్పు. బ్లడ్ ఈజ్ దిక్కర్ దేన్ వాటర్. వారందరూ రక్త సంబంధీకులు, వారిలో వారికి ఎన్ని తప్పులున్నా, చక్కగా సరిదిద్దుకుంటారు. నా రక్తం, నా గ్రూపు వేరుగా. అందుకే కలపనివ్వరు."

"మరి అత్తయ్యగారు నన్ను అంత అప్యాయంగా చూస్తారు కదా! మరి నా రక్తం మాత్రం వేరు కాదూ?"

"వదినా! అందరూ అమ్మలాంటి వాళ్ళే ఉంటే ఈ లోకం, ఈ సంఘం బాగుపడిపోవూ? ఇక సంఘంలో సమస్యలేం ఉంటాయి? పరిష్కారం దేనికైనా కావాలంటే ముందు సమస్యలంటూ ఉండాలిగా? అందుకే డబ్బు ఖర్చులేని, అతి తేలిక అయిన సమస్య అబల అయిన ఆడదాన్ని అణగదొక్కడమే."

"లోపల అంత బాధ పెట్టుకుని నవ్వుతూ ఎలా మాట్లాడుతున్నావు వినూ!" బాధగా అంది మమత, నవ్వుతున్న వినూత్నను చూసి.

"నవ్వకపోతే, మరేం చేయమంటావు? ఏడవమంటావా? ఏడ్చినందువల్ల సమస్యలకు పరిష్కారం దొరికితే నే నేమిటి, సమస్యలలో చిక్కుకున్న వా ళ్ళందరూ పరిష్కారం సంగతి పక్కకు పెట్టి ఏడుస్తూ కూర్చుంటే పోలా, ఏ గొడవా ఉండదు."

వినూత్న మాటలకు ఆశ్చర్యంగా చూస్తూంది మమత. ఇంతలో మమత కూతురు శ్వేత ఏడవడంతో వెళ్ళి ఎత్తుకుంది వినూత్న. శ్వేతను ఎత్తుకోగానే, ఒక విధమైన మాతృ ప్రేమ పొంగిపొరలుతుంది వినూత్నలో. అంతలోనే గొడ్రాలు అన్న అత్తగారి మాటలు వేయి గొంతులతో కర్ణకఠోరంగా వినబడతా యామెకు.

రామున్న క్షణం

జనం
మనకు జైకొట్టిన జనం
గొర్రె మందలని
వేణువాదానికి స్పందించే
అలమంద లనుకుంటే
అలలా
సముద్రపు జలలా
తిక్కరేగిన గాలిని
త్రిప్పి కొట్టి
ఆకాశాన్ని భూమిని
ఏకం చేసే కడలిలా
విజృంభిస్తాడు—
గొర్రెలు సింగాలవుతాయి
అలమందలు రంకెలు వేస్తాయి
అందుకే—
గడచిన
నిమిషమే మనది
రానున్న క్షణం
రాజుకుంటున్న నిప్పు
ప్రగతికి క్రాంతి దివిటీలు
వెలిగించే అక్షరాస్త్రాల
సమసమాజ ప్రతీక!
జనవాహిని తరంగిత పతాక!

-వంశీ రామరాజు

'భగవాన్! చేయని తప్పుకు శిక్ష. కోడలిని తాకని కొడుకుని వెనకేసుకువచ్చి కోడలిని గొడ్రాలు అన్న ఆవిడ నోటిని ఏమనాలి. దాన్ని నోరు అని అంటే 'నోరు' అన్న మాటను అవమానించినట్లే అవుతుంది!

వరంధామయ్యగారు హడావిడిగా వచ్చి "రేపటికి టిక్కెట్లు దొరికాయి గోదావరి ఎక్స్‌ప్రెస్‌కి, రేపు బయలుదేరుతున్నట్లు అల్లుడుగారికి టెలిగ్రామ్ ఇచ్చాను" అని చెప్పారు వినూత్నతో. వినూత్నలో ఏ భావమూ లేదు. అన్నిటికీ అలవాటు పడిపోయిన దానిలా నిర్లిప్తంగా ఉంది.

"బట్టలు సర్దేసుకుంటున్నావా?" మమత అడిగింది.

"నీవు సర్ది పెడతానంటే సర్దుకోను. లేదంటే నాకు తప్పదుగా!"

"నీ తరఫున తిని పెట్టడం వచ్చుగాని, నాకు సర్ది పెట్టడం రాదు." మమత అంది.

"నీ వలా అంటున్నావుగాని, నిజానికి నీకు అది కూడా చేతకాదు. నీవంతు తిండే నీవు పూర్తిగా తినలేవు, నా వంతు ఆహారం నీవేం తినగలవు?" అంది వినూత్న.

మమతను చూస్తుంటే తిండి తిన్నా, తినకపోయినా, ఏ చికాకులూ లేని ఇంట్లో సంతోషాన్ని భోంచేయవచ్చు అన్నట్లుంటుంది వినూత్నకు. 'సంతోషంగా జీవితం గడపడానికి కూడా పూర్వజన్మలో పుణ్యం చేసుకొని ఉండాలేమో. వదిన ఎంత పుణ్యం చేసుకుందో, నిశ్చింతగా బ్రతుకుతుంది' అనుకుంది వినూత్న. కాని, వదిన జీవితం భవిష్యత్తులో చాలా మలుపులు తిరుగుతాయని, అదీ తన కారణంగా అని ఆ సమయంలో ఆమెకు తెలియదు. తెలిసి ఉంటే కలలో కూడా ఆ ఊహ రానిచ్చేది కాదు.

"రాత్రి మా మహంకాళి వదినను ఏవేవో నేను తిడుతున్నట్లు కల వచ్చింది. తిట్లు కాదు గాని, నా జీవితం ఏమిటి అని నిలదీసి అడుగుతున్నాను కలలో" అంది వినూత్న.

"కనీసం కలలోనైనా తెలివితేటలు ఉపయోగించావు. చాలా సంతోషం" అంది మమత. మనకు తెలియకుండానే మన మనసులో జరిగే సంఘర్షణ, ఆరాటం కలల రూపం ధరించడం మామూ లే కదా!

"మావదినకు గాని నా కల సంగతి చెప్పానంటే ఇక చూస్కో తడాఖా, నన్ను దుమ్ము దులిపేస్తుంది—కలలో ఎందుకు ఎదిరించావంటూ" వినూత్న అంది. ఇంతలో మమత కూర్చున్న చోటినుంచి లేచింది.

"ఎక్కడకు వెళుతున్నావు?" వినూత్న అడిగింది.

"మీ వదినగారికి టెలిగ్రామ్ ఇవ్వడానికి నీ కల గురించి" ఇద్దరూ హాయిగా నవ్వుకున్నారు. ఆ నవ్వులకు త్వరలోనే తెరపడుతుందని వారికి తెలియదు పాపం!

"టెలిగ్రామ్ ఎందుకు, ఈమధ్య టెలిగ్రామ్‌లు అన్నీ ట్రెయిన్ వెళ్ళిపోయిన తరువాత, చనిపోయిన మనిషి గురించి ఇచ్చిన టెలిగ్రామ్‌లు ఖర్మనాటికి చేరుతున్నాయని నీకు తెలియదా? నేనే వెళ్ళి నా కల గురించి చెబుతానులే."

"నీవైతే అబద్ధం చెబుతావేమో?"

"ఏం అబద్ధం చెప్పను. 'మహంకాళి వదినగారూ, మిమ్మల్ని నేను తిట్టినట్లు నాకు కల రాలేదండి' అని మాత్రం చెబుతాను." మళ్ళీ నవ్వుకున్నా రిద్దరూ.

"వదినా! ఈసారి నీవూ, అన్నయ్యా మా ఊరు రావాలి సుమా!" అంది వినూత్న. వినూత్నకు అత్తవా రింటికి వెళ్ళాలంటే దిగులుగానే ఉంది.

"అలాగే తప్పకుండా వస్తాం గానీ, నీవు మాత్రం కొన్ని నీ నోరు విప్పి వాళ్ళ లోపాలు కూడా గుర్తు చేస్తూ ఉండు. నీవలా గుర్తు చేయకపోతే తమంత మంచివాళ్ళు లేరని భావించుకోగలరు." మమత అంది.

"నీవు వస్తావుగా? నీ నోరు అద్దెకు తీసుకొని అప్పుడు ధైర్యంగా విప్పుతానులే! అప్పటివరకూ ఇలాగే ఉండనియ్యి" అంది.

కాని, ఆ సమయంలో వినూత్న కాపురం చక్కదిద్దడానికి కాక, వినూత్నను విధవగా చూడడానికి వెళ్ళవలసి వస్తుందని మమతకు తెలియదు. జరగబోయేది తెలియకపోవడమే సృష్టిలోని విచిత్రం.

మమత ఆలోచనల్లో ఉండగానే రాజమండ్రి వచ్చింది. అత్తమామలను జాగ్రత్తగా చేయిపట్టుకొని దింపింది మమత. వారు ప్రాణం లేని కట్టెల్లా ఉన్నారు ఆవేదనతో. మమత, భానుమూర్తి ఎలా నడిపిస్తే అలా నడిచేటట్లున్నారు గాని, కాలుతీసి కాలు పెట్టే శక్తి వారికి ఆ టెలిగ్రామ్ చూడగానే పోయింది.

బస్ స్టాండుకి వెళ్ళి అమలాపురం బస్ రెడీగా ఉంటే అది ఎక్కేశారు. అమలాపురంలో మరో బస్ మారవలసి వచ్చింది. అలాగే బస్సు మారి, వాళ్ళు ముమ్మిడివరం చేరుకున్నారు అతి ప్రయాసతో. తీరా వాళ్ళు వెళ్ళేసరికి చాలా సమయం అయిపోయిందని, మర్నాడు శుక్రవారం వచ్చినందువల్ల శవదహనం జరిగిపోయిందని చెప్పారు వారు. వినూత్నను పట్టుకొని అందరూ బావురు మన్నారు. వినూత్న మాత్రం సుఖ, దుఃఖాలకు అతీతంగా అలా రాయిలాగే కూర్చుండిపోయింది గాని, ఆమె మనసులో ఎలాంటి ఆలోచనలు ఉన్నాయో ఎవరికీ అర్థం కాలేదు.

శ్యామలరావుకి కడుపులో నొప్పి వస్తే హాస్పిటల్‌కి తీసుకొని వెళ్ళడానికి అలస్యమైందట. ముమ్మిడివరంలో వాళ్ళ ఫామిలీ డాక్టరుగారు లేనందున టాక్సీలో అమలాపురం తీసుకెళ్ళారట. ఇంకా డాక్టరుగారు ఆపరేషన్ మొదలుపెట్టకుండానే అపెండిసైటిస్ బరస్ట్ అయి అతను అక్కడే ప్రాణాలు వదిలేశాడట. అప్పటి నుంచి వినూత్న ప్రాణాలు తీస్తున్నారట వారు—ఆమె వచ్చిన వేళా విశేషం బాగులేదని.

ఏడుపుల కార్యక్రమం అయిపోయిన తరువాత మహంకాళి అందుకుంది, అందరికీ వినబడేలా—"నా తమ్ముడు దుక్కలా గుండేవాడు, ఏనాడు తుమ్మి ఎరుగడు, దగ్గి ఎరుగడు. ఈ మహాతల్లి కాపురానికి వచ్చింది మొదలు కడుపు నొప్పో, కడుపు నొప్పో అనేవాడు కాని, మేమే ఏదో నొప్పిలే అనుకున్నాం. ఆఖరికి మా తమ్ముణ్ణి పొట్టన పెట్టుకుంది మహమ్మారి. ఏ ముహూర్తాన మా ఇంట్లో కాలు పెట్టిందో గాని, వాడు ఒక్కనాడూ శాంతిగా బ్రతకలేదు. ఆఖరికి అందరినీ వదిలి వెళ్ళిపోయాడు" అంటూ రాగాలు తీసింది శ్యామలరావుకి అక్కలా కాదు, ఏదో ఏడవడానికి అద్దెకు వచ్చినదానిలా. ఆవిడ అసలు తన సంగతి మరచిపోయింది. ఆవిడ కూడా అత్తింటికి వెళ్ళిన మూడు నెలలకే మొగుణ్ణి సాగనంపి పుట్టింటికి చేరింది. గురివిందలా ఇప్పుడు వినూత్నను సాధిస్తుంది. మనుష్యుల మనస్తత్త్వం ఎంత విచిత్రమైనది! తమకో నీతి, పరాయివారి కో నీతి.

అక్కడ ఉన్న రోజుల్లో పార్వతికి, వరంధామయ్యగారికి అల్లుడు సంగతి వారి ద్వారా, వారి ద్వారా తెలిసింది. అత్తగారూ, ఆడబడుచుల సూటిపోటీ మాటలతో వినూత్న జీవితం ఆ ఆరు నెలలు ఎలా సాగిందో సులువుగానే గ్రహించారు. ఆ తరువాత ఎప్పుడూ వాళ్ళు అల్లుడి చావు గురించి ఏడవలేదు, కూతురి బ్రతుకు గురించే దుఃఖించారు. అన్ని కార్యక్రమాలూ పూర్తి చేసుకొని వినూత్నతో బాటు తిరిగి వరంగల్లుకి ప్రయాణమై రాజమండ్రి చేరుకున్నారు. అక్కడ ట్రెయిన్ ఎక్కాలి. రాజమండ్రి బస్ స్టాప్‌లో బస్ దిగి రిక్షాల గురించి చూస్తున్నారు.

రిక్షాలో సామాను పెడదామని సామాను చూడగా అందులో వినూత్న సూట్‌కేస్ లేదు. ఆ చుట్టుపక్కల వెతికారు. అందరినీ అడిగారు. కాని, ఏం లాభం, పోయిన వస్తువు దొరుకుతుందా! అల్లుడే పోగా లేంది ఇంక సూట్‌కేస్ లేకపోతే ఏమైందని సరిపెట్టుకున్నారు. ఆ సూట్‌కేస్‌లో ఆమె పెళ్ళినాటి పట్టు బట్టలు, నల్లపూసలు, మంగళసూత్రాలు ఉన్నాయి. ఆ సూట్‌కేస్ పోవడంతో వినూత్న పెళ్ళి తాలూకు బంధం పూర్తిగా తెగిపోయింది. ఒంటరిగా కాలేజీ స్టుడెంట్‌లా ట్రెయిన్ ఎక్కింది. ఆ సూట్‌కేస్‌తో పాటు ఆ విచారం కూడా దొంగ పట్టుకొనిపోయినట్లున్నాడు, ఆమె మొహం తేటగా కనిపించింది అందరికీ.

ఇంటికి వచ్చిన తరువాత అందరి పలకరింపులు, పార్వతమ్మగారి ఏడుపులు నాలుగైదు రోజులు సాగాయి. వినూత్న కంటినుంచి ఒక్క కన్నీటి చుక్క కూడా రాకపోవడం మమత గమనించకపోలేదు. అసలు తమ ఇద్దరి మధ్యా ఏం బంధం ఉందని ఏడవాలో అర్థం కాలేదు వినూత్నకు. భర్త చనిపోగానే మహంకాళి అన్న మాటలతోనే అటూ, ఇటూ ఊగుతున్న ప్రేమ మంగళసూత్రంతో పాటే తెగిపోయింది. ఇక వీరికి, నాకూ ఏ విధమైన బంధం అనుకుంది వినూత్న.

భానుమూర్తికి శ్యామలరావు చనిపోయిన తరువాత చెల్లెలుమీద ప్రేమ రెట్టింపు అయింది. ఇప్పుడు ఇంకా ఆప్యాయంగా చూస్తున్నాడు చెల్లెలిని. అతనికి చెల్లెలి పేరుని మార్చేసి అనసూయ అనో, అరుంధతి అనో పెట్టేయాలనిపిస్తుంది. 'నా చెల్లెలు భర్త చేతకానివాడైనా కిక్కురుమనకుండా కాపురం చేసి వచ్చిన పతివ్రత' అని అందరికీ చాటిచెప్పాలనిపిస్తుంది. కాని, అతనికి వినూత్న మనోవేదనతో గాని, ఆలోచనలతో గాని సంబంధం లేదు. ఆమెకు గుండు చేయించి, తెల్ల చీర కట్టించి, ఒక్కపూట భోజనం పెట్టించి, వంటింట్లో కూర్చోబెడితే ఇంకా ఎంతో సంతోషించేవాడు భానుమూర్తి.

తరాలు మారేకొద్దీ మనుషుల మనస్తత్త్వాలు, ఆలోచనా ధోరణులు మారతాయి. పాత తరంలోని మంచి పద్ధతి కొత్త తరానికి వింతగా అనిపించవచ్చు. మూర్తి ఆ కాలంలో పుట్టవలసినవాడు పొరపాటున ఈ కాలంలో పుట్టాడా అనిపిస్తాడు మమతకు. ఆ కాలంలో పుట్టినా, రాజారామోహన్‌రాయ్, వీరేశలింగం లాంటివారు అతణ్ణి మార్చి ఉండేవారేమో, ఇప్పుడు వారు రాసిన పుస్తకాలు తప్పించి, ప్రత్యక్షంగా ప్రబోధించి, ఆచరించేవారు కనబడడంలేదు. ప్రజలలోని బూజు పట్టిన భావాలను తమ ప్రవర్తనలో దులిపేవారు ముందుకి రావడం లేదు. ఆరు నెలలు గడిచాయి. పార్వతమ్మ, వరంధామయ్యగార్లకు తమ కూతురి భవిష్యత్తు ముందు ముందు ఎలా అన్న దిగులు పట్టుకుంది. వినూత్న ఎప్పుడూ ఏదో దీర్ఘాలోచనలోనే ఉంటుంది. ఆమెకు భర్త పోయాడన్న బాధ కొంచెం కూడా లేదు. ఎంత కాలం అన్నగారికి భారంగా ఉండాలి అన్నది ఆమెకు తీరని సమస్య అయిపోయి కూర్చుంది.

(సశేషం)

పులితో చెలిమి

కవిత వ్రాసుకుందామని
గదిలోకి వెళ్ళాను
కుర్చీలో పెద్దపులి
కూర్చుని ఉండడం చూశాను
గుండె గతుక్కుమంది
గొంతు పలకనంది
"కవీ! నీ చేతిలో తుపాకీ లేదు
కనుక నీకు నాతో భయం లేదు
దానవులు మానవులను చంపారు నాడు
మానవులే మానవులను చంపుతున్నారు నేడు"
వివేకవంతురాలైన పులితో చెలిమి చేయా లనిపించింది
గోముఖ వ్యాఘ్రాలు మానవులే అని రుజువైంచి.

-డా॥ దాశరథి